

పంబాపూర్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి


# సమన్వయంతో పనిచేద్దాం

- సమష్టి కృషే గెలుపునకు మార్గం
- ప్రతి ఓటరు గడపకూ వెళ్లండి
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించండి
- గ్యారెంటీ, వారంటీ పథకాలను తిప్పికొట్టండి
- విపక్షాల పాలిత రాష్ట్రాల్లో వాటి అమలు తీరును ఎండగట్టండి
- బీఆర్ఎస్ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి
- గ్రామాల్లో కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనాలు

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ఇంకా 45 రోజులే ఉంది. కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేయాలి. సమష్టి కృషితోనే మన గెలుపు సాధ్యం' అని బీఆర్ఎస్ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం భూపాలపల్లి మండలంలోని రాంపూర్, గొల్లబుద్దారం, దూదేకులపల్లి, దీక్షకుంట, పంబాపూర్, నందిగామ, ఆజంనగర్, నాగారం, కమలాపూర్ గ్రామాల్లో జరిగిన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా రాంపూర్‌లో గ్రామ సర్పంచ్ తాటి వెంకన్నతో కలిసి మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం సమ్మేళనాల్లో కార్యకర్తల నుంచి ఆయా గ్రామాల్లో పార్టీ పరిస్థితులను ఆరా తీశారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ.. ప్రతి పార్టీలో చిన్న చిన్న భేదాభిప్రాయాలు సహజమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ఏదో ఒక రకంగా ప్రతి గడపకూ చేరాయని అన్నారు. వాటిని కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత కరెంటు, గృహాలకు కోతలు లేని కరెంటు, రైతు బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, పోడు భూములకు పట్టాలు, గిరి వికాస పథకం కింద బోర్లు, పింఛన్లు, గురుకులాల్లో నాణ్యమైన ఉచిత విద్య, డబుల్ బెడ్‌రూం, ప్రభుత్వ ఆస్పత్రుల నవీకరణ చేసిందన్నారు. కంటి వెలుగు, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు, కొత్త మండలాల ఏర్పాటు, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్పు, బీసీ బంధు, దళితబంధు, గృహలక్ష్మి.. ఇలా అనేక పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేసిందని వివరించారు. ఈ పథకాలన్నీ ఓటర్లకు వివరిస్తూ ఇలాంటివి ఏ రాష్ట్రంలో లేవని, మనల్ని చూసి ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు కాపీ కొడుతున్న విషయాన్ని గుర్తు చేయాలని అన్నారు. దళితబంధు, బీసీ బంధు, డబుల్ బెడ్‌రూం, గృహలక్ష్మి లాంటి పథకాల అమలు ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం క్రమక్రమంగా అమలు చేస్తుందని, కొంత ఆలస్యమైనా లబ్ధిదారులందరికీ అందుతాయన్నారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని వివరించాలన్నారు. ఈ నెల 15న ప్రజలు మెచ్చేలా కేసీఆర్ మేనిఫెస్టోను విడుదల చేస్తున్నారని, ప్రజలందరూ గమనించాలని కోరారు. కేసీఆర్ విడుదల చేసే మేనిఫెస్టోను నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరికి వివరించాలన్నారు. గత రెండు ఎన్నికల్లో ప్రభుత్వం విడుదల చేసిన మేనిఫెస్టోలోని హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ వారి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా అమలు చేయని గ్యారెంటీ, వారెంటీలతో ప్రజల ముందుకు వస్తున్నారని, ఈ కుట్రలను ప్రజలకు వివరించాలని నాయకులను, కార్యకర్తలను కోరారు. గ్యారెంటీలతో ఓటు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను ఈ గ్యారెంటీలు మీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడ అమలు చేస్తున్నారో తెలుపాలని, నిలదీయాలని కోరారు. ప్రజలు అభివృద్ధిని చూసి ఆదరించాలని, బీఆర్ఎస్‌ను మరో మారు ఆదరిస్తే రాష్ట్రంలో, నియోజకవర్గాల్లో ఊహించని అభివృద్ధి సాధ్యమవుతుందని, దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిన్‌రెడ్డి రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బుర్ర రమేశ్, మాజీ ఎంపీపీ కళ్లెపు రఘుపతిరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మందల విద్యాసాగర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాంపల్లి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు పాలకుర్తి రఘుపతిగౌడ్, సీనియర్ నాయకులు పింగిళి రవీందర్‌రెడ్డి, వాసంపల్లి మహిపాల్‌రెడ్డి, బోస్, గోపి, గోవిందుల శ్యామ్, భీముని శరత్, ముద్దమల్ల భార్గవ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- పేదింటి బిడ్డను ఆశీర్వదించండి
- తనను గెలిపిస్తే ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తా
- ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటా
- బీఆర్ఎస్ ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి
- ములుగు, గోవిందరావుపేట, చల్వాయిలో విస్తృత ప్రచారం
- ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ.. ఓట్ల అభ్యర్థన
- పాల్గొన్న రెడ్కో చైర్మన్‌సతీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు



చల్వాయిలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న నాగజ్యోతి

ములుగురూరల్/గోవిందరావుపేట, అక్టోబర్13: ప్రజలు తనను ఇంటి ఆడబిడ్డగా ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. గట్టమ్మ తల్లి ఆశీస్సులు పొంది శుక్రవారం ఆమె తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. రాష్ట్ర రెడ్కో చైర్మన్, మండల ఎన్నికల ఇన్‌చార్జి ఏరువ సతీశ్‌రెడ్డి, బీఆ ర్ఎస్ నాయకులతో కలిసి ప్రేమ్‌నగర్, ములుగు, గోవిందరావుపేట, చల్వాయిలో ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా చేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఒక పార్టీ, ఎమ్మెల్యేగా మరో పార్టీ అభ్యర్థి ఉండడం వల్ల గత ఐదేళ్లుగా ప్రజా సమస్యలు పరిష్కరించబడలేదని అన్నారు. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రజలు ఒకటికి రెండు సార్లు ఆలోచన చేసి బీఆర్ ఎస్ పార్టీ తరపున ఎన్నికల బరిలో ఉన్న తనను ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు తనకు ఓటు వేయాలని కోరారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మద్దతు తెలిపినట్లేనని నాగజ్యోతి ఓటర్లకు వివరించారు. చల్వాయి గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగు పూర్ణచందర్ ఆధ్వర్యంలో పలు పార్టీలకు చెందిన యువకులు, మ హి ళలు 100 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు.



ఓటు అభ్యర్థిస్తున్న నాగజ్యోతి

**ప్రజలతో మమేకమై..**

ఎన్నికల ప్రచారంలో భాగంగా బడే నాగజ్యోతి గడప గడపకు తిరుగుతూ ప్రజలతో మమేకమైంది. తల్లిదండ్రులు లేని తనకు ప్రజలే కుటుంబ సభ్యులని, కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే ప్రతి ఇంటిలో వెలుగులు నింపుతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నాగజ్యోతికి ఘన స్వాగతం పలికారు. బొట్టు పెట్టి స్వాగతించి చీరె, సారెను అందించి ఎన్నికల ఖర్చుల కోసం కొంత నగదును సైతం అందించారు. మహిళలు బతుకమ్మలతో మంగళహారతులు పట్టారు. వారితో కలిసి నాగజ్యోతి బతుకమ్మ ఆడారు. మసీదు వద్ద ముస్లింలను ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆరు నెలల్లో షాదీఖానతో పాటు ప్రహరీ నిర్మిస్తానని నాగజ్యో తి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మ ణ్‌రావు, గోవిందరావుపేట మండల ఇన్‌చార్జి సాంబారి సమ్మారావు, మండల పార్టీ అధ్యక్షుడు బాదం ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, గోవిందరావుపేట జడ్పీటీసీ తుమ్మల హరిబాబు, ఎంపీటీసీలు గొర్రె సమ్మయ్య, నూనవత్ మహేశ్‌నాయక్, మాచర్ల ప్రభాకర్, అజ్మీరా ధరమ్‌సింగ్, మాజీ ఎంపీపీలు వినయ్‌కుమార్, డోలి రమేశ్, బీఆర్ఎస్ నాయకులు గండ్రకోట సుధీర్‌యాదవ్, రమేశ్‌రెడ్డి, వేల్పూరి సత్యనారాయణరావు, మల్క రమేశ్, వేములపల్లి భిక్షపతి, ఊర విష్ణువర్ధన్‌రెడ్డి, సాని కొమ్ము రమేశ్‌రెడ్డి, రియాజ్‌మిర్జా, సకినాల శశి కాంత్, బైకాని సాగర్, మాదం సాగర్, గజ్జి నగేశ్, కోగిల మహేశ్, మోహన్, ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ తుమ్మల హరిబాబు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సూరపనేని సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్ అయ్య లెక్క ఆదుకుంటాండు..

– కత్తెరపల్లి లక్ష్మి, కన్నాయిగూడెం



నాకు అయ్యవ్వ చనిపోయిన తర్వాత కేసీఆర్ సారే నా అయ్యవ్వ. నాకు పింఛన్ పైసలు ఇచ్చి ఆదుకుంటాండు. పండుగకు చీరెలు పంపబట్టే. తినడానికి బియ్యం ఇయ్యబట్టే. బుక్కెడు బువ్వ ఎవలది తింటానమో ఆళ్లకే ఓటేత్తం. కాళ్లు చేతులు లేనోళ్లకు కూడా పైసలు ఇయ్యబట్టే. మళ్ల కేసీఆరే వస్తడు. నా అయ్య వస్తే శివరాత్రికి రెండు కొబ్బరికాయలు కొడతా' కన్నాయిగూడేనికి చెందిని లక్ష్మి వివరించింది. నాగజ్యోతి లక్ష్మి వద్దకు వెళ్లి ఓటు అభ్యర్థించగా ఆమె తలపై చేయి పెట్టి ఆశీర్వదించింది.

# 'తెల్లం'ను ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసిచూపిస్తాం..

- ఖమ్మం ఎమ్మెల్సీ తాతా మధు

వెంకటాపురం(నూగూరు) అక్టోబర్ 13: బీఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావును ప్రజలు ఆశీర్వదిస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తామని ఖమ్మం ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి గెలవాలన్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వెంకట్రావు గెలుపునకు కృషి చేయాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజాసంక్షేమ పథకాలే బీఆర్ఎస్ అభ్యర్థులకు శ్రీరామరక్ష అన్నారు. తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ఒక్కసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే ప్రజలకు అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నా రు. అనంతరం పలు పార్టీలకు చెందిన వ్యక్తులు ఎమ్మెల్సీ మధు, వెంకట్రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నర్సింహమూర్తి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గూడపాటి శ్రీనివాస రావు, చిడెం రవి కుమార్, అన్నెం సత్యాలు, నవాబ్, ముడుంబా శ్రీను, వెంకటాపురం ఉపసర్పంచ్ దేవరకొండ ధనలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు నారాయణమ్మ, చిట్టెం రవి, గడ్డం వివేక్, సతీశ్, చింతల శ్రీను ఉన్నారు.



తెల్లం సమక్షంలో బీఆర్ఎస్ చేరిన కార్యకర్తలు




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

# ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- అభ్యర్థుల ఖర్చులు నమోదు చేయాలి
- సమావేశాలకు అనుమతి తప్పనిసరి
- ఫిర్యాదులకు టోల్ ఫ్రీనంబర్ 1950
- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా

కృష్ణకాలనీ, అక్టోబర్ 13 : అసెంబ్లీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని భూపాలపల్లి జిల్లా, ఎన్నికల అధికారి కలెక్టర్ భవేశ్‌మిశ్రా కోరారు. శుక్రవారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల ఖర్చుల నమోదు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తదితర అంశాలపై జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ. 40 లక్షలకు మించరాదన్నారు. అభ్యర్థి నామినేషన్ వేసినప్పటి నుంచి కౌంటింగ్ రోజు వరకు చేసే ప్రతి ఖర్చును అభ్యర్థి ఖాతాలో జమ చేస్తామన్నారు. నామినేషన్ వేసినప్పటి నుంచి అభ్యర్థి ఎన్నికల కోసం చేసే ఖర్చు ప్రత్యేక బ్యాంకు ఖాతా ప్రారంభించాలన్నారు. అందులో నుంచి మాత్రమే ఎన్నికల ఖర్చు చేయాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల సమావేశాలు, సభలకు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం ప్రభావం ఉండకుండా నిరంతరం నిఘా ఉంటుందన్నారు. 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలు లేదన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా మహేశ్వర్, ఆడిట్ అధికారి శ్రావణ్, డీపీఆర్ఓ వీ శ్రీధర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రింటింగ్, ఫ్లెక్సీ షాపుల యాజమానులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.